క్లుప్తంగా

పరీక్షల సన్నద్ధతపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న లెక్చరర్ సూర్యప్రకాశ్‌రెడ్డి

శంకర్‌పల్లి: విద్యార్థులు పరీక్షల సమయంలో గందరగోళానికి గురి కావొద్దని హైదరాబాద్ శ్రీచైతన్య కళాశాల లెక్చరర్ సూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మాట్లాడుతూ.. విద్యార్థులు పరీక్షల సమయంలో ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని, అదేవిధంగా ఎలా రాస్తాం, పేపర్ ఎలా వస్తుందన్న ఆలోచనలు మానుకోవాలని సూచించారు. పరీక్షలకు ముందే ప్రణాళిక ప్రకారం చదువుకొని, సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామంలో జిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. సోమవారం జిమ్స్ ఆస్పత్రి డాక్టర్ రఘునందన్ ఆధ్వర్యంలో వైద్యులు 213 మంది రోగులను పరీక్షించారు. అనంతరం అవసరమైన వారికి మందులు అందించారు. వీరిలో 13 మంది రోగులను మెరుగైన చికిత్స కోసం శంషాబాద్ సమీపంలో ఉన్న ముచ్చింతల్‌లోని జిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో వైద్యులు రఘురాం, మృధుల, సల్మాన్, సిబ్బంది నాయుడు, సురేశ్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి ప్రసన్న లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నందిగామ: మండల పరిధిలోని చేగూరులో గల ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి చక్కగా పాఠాలు బోధించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బోధనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తావుర్యానాయక్, ఎస్‌ఎంసీ చైర్మన్ భాగ్యమ్మ, టీచర్లు గాయత్రి, అనందశ్రీ, లక్ష్మీ ప్రసన్న, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీకేఎస్ జాతీయ అధ్యక్షుడికి ఘన స్వాగతం



శంషాబాద్ విమానాశ్రయంలో సాయిరెడ్డికి స్వాగతం పలుకుతున్న నాయకులు

షాబాద్: భారతీయ కిసాన్ సంఘం జాతీయ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన కొండాల సాయిరెడ్డి, సంఘటన మంత్రి మాదిరెడ్డి రాజిరెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో బీకేఎస్ నాయకులు సోమవారం ఘన స్వాగతం పలికారు. భారతీయ కిసాన్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఉన్న కొండాల సాయిరెడ్డి, జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవడం హర్షణీయమన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి భారతీయ కిసాన్ సంఘం ఎప్పుడు పోరాటం చేస్తూనే ఉంటుందని జాతీయ అధ్యక్షుడు సాయిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గంగిడి సత్యనారాయణరెడ్డి, కందాడ గ్రామ కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కార్యదర్శి విశ్వనాథం తదితరులు ఉన్నారు.

‘డబుల్’ ఇళ్లు కేటాయించేదెప్పుడో?

- అజీజ్‌నగర్‌లో నిర్మాణాలు పూర్తయినా అర్హులకు అందని గృహాలు
- సురంగల్‌లో అసంపూర్తిగానే దర్శనమిస్తున్న వైనం
- పట్టించుకోని అధికారులు



అజీజ్‌నగర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు

మొయినాబాద్: పదేళ్లుగా కలలు కంటున్నా డబుల్ బెడ్రూం ఇళ్లు అర్హులకు దక్కడం లేదు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా డబుల్ ఇళ్ల నిర్మాణం చేపట్టినా ఇప్పటికీ లబ్ధిదారులకు అందడం లేదు. నిర్మాణాలు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వకుండా అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రకటించింది. అందులో భాగంగా మొయినాబాద్ మండలంలోని సురంగల్, అజీజ్‌నగర్, కనకమామిడి, చిలుకూరు, చిన్నమంగళారం, తోలుకట్ట తదితర గ్రామాలకు 2016లో ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేసింది. అప్పటి రవాణా శాఖ మంత్రి మహేందర్‌రెడ్డి చేతులమీదగా పలు గ్రామాల్లో ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన సైతం చేశారు. ఆ తరువాత రెండేళ్లకు సురంగల్, అజీజ్‌నగర్ గ్రామాల్లో మాత్రమే పనులు మొదలు పెట్టారు. సురంగల్‌కు 20 డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు కాగా 16 ఇళ్ల నిర్మాణ పనులు మాత్రమే చేపట్టారు. అవికూడా అసంపూర్తిగానే ఉన్నాయి. అజీజ్‌నగర్‌లో 40 డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టారు. సుమారు ఎనిమిదేళ్ల పాటు పనులు కొనసాగాయి. ఇళ్ల నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు వాటిని ప్రారంభించలేదు.

రెండేళ్ల క్రితమే అర్హుల గుర్తింపు

గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను పేదలకు ఇచ్చేందుకు రెండేళ్ల క్రితమే గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి అర్హులను గుర్తించారు. అసెంబ్లీ ఎన్నికల ముందే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించి అప్పగించాలని అప్పటి ప్రభుత్వం ప్రయత్నం చేసింది. కానీ అప్పట్లో పనులు పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులకు అప్పగించలేదు. అంతలోనే అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కొత్త ప్రభుత్వంలోనైనా డబుల్ బెడ్రూం ఇళ్లు లబ్ధిదారులకు అందుతాయనుకున్నా అవి అందని ద్రాక్షలా మారాయి. ఇళ్లు ఎప్పుడిస్తారో.. తమకు సొంతింటి కల ఎప్పుడు తీరుతుందోనని లబ్ధిదారులు ఆశతో ఎదురుచూస్తున్నారు.



సురంగల్‌లో అసంపూర్తిగా ఇళ్ల నిర్మాణం

కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది

అజీజ్‌నగర్‌లో డబుల్ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వాటికి కరెంటు కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. ఆయా శాఖల అధికారులకు తెలియజేశాం. ఆ పనులు పూర్తయితే లబ్ధిదారులకు ఇళ్లు అప్పగించవచ్చు. సురంగల్‌లో డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదు.

– విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీఈ, మొయినాబాద్

కంటి సంరక్షణకు చర్యలు

ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

షాద్‌నగర్: కంటి సంరక్షణకు అందరూ ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం గత వారం రోజులుగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఈ శిబిరాన్ని డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. శరీర భాగాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని, జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. విద్యార్థుల కంటి సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. చిన్నారులు సెల్‌ఫోన్‌లు, టీవీలు అధికంగా చూడటంతో చూపు మందగిస్తుందని, తద్వారా చదువుపై ప్రభావం పడుతుందన్నారు. అదేవిధంగా విద్యార్థులు వెలుతురు ఉండే ప్రదేశాల్లోనే చదువుకోవాలని సూచించారు. కంటికి ఏ చిన్న సమస్య వచ్చినా వెంటనే సమీపంలో ఉన్న కంటి వైద్యులను సంప్రదించి చికిత్సలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు తమ పిల్లలకు పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని సూచించారు. శిబిరంలో 2,581 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. శిబిరానికి విచ్చేసిన విద్యార్థులకు బిస్కెట్లు, మంచినీటి బాటిళ్లను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, పద్మలత, పుష్పలత, ఆప్తమాలజిస్టు రమేశ్, నరేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఆర్‌బీఎస్ వైద్యులు విజయలక్ష్మి, సంధ్య, రాగిణి, కార్తీక్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మురుగు.. పరుగు

- ఇళ్ల మధ్యన పారుతున్న నీరు
- దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



మురుగునీటిలో అవస్థలు పడుతున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: ఇళ్ల మధ్యనే మురుగునీరు ప్రవహిస్తుండడంతో దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇళ్ల నుంచి రోడ్డుపైకి రావాలంటేనే ఇబ్బందిగా ఉందని పేర్కొంటున్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలో గల అజీజ్‌నగర్ చౌరస్తాలో ఉన్న ఓ హాస్టల్‌లో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. గత 15 రోజులుగా అదే మాదిరిగా మురుగు ప్రవహించడంతో రోడ్డుపై నిలిచి దుర్వాసన వస్తోందని ఆరోపిస్తున్నారు. ఈ చుట్టూ పక్కన ఉన్న ప్రజలు హైదరాబాద్- బీజాపూర్ రహదారిపైకి వెళ్లాలంటే అవస్థలు పడుతున్నారని, అధికారులు ఇప్పటికైనా ఈ మురుగు రోడ్డుపైకి రాకుండా చూడాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య పనులు చేపడుతున్న అధికారి వెంకటేశ్వర్‌రెడ్డిని మురుగు సమస్యపై వివరణ కోరగా.. ఇళ్ల మధ్యలో ఈ సమస్య ఉన్న విషయంపై మాకు సమాచారం అందలేదు. త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకొని మానసిక ప్రశాంతత పొందాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో శివ, హనుమాన్ దేవాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ఆయన హాజరై స్వామివారికి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని, తద్వార ఏకాగ్రత పెరుగుతుందన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం దేవాలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్సీకి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శాంతమ్మ, నాయకులు సుధీర్, భిక్షపతి, విష్ణుమూర్తి, శేఖర్, నారాయణ, చారి, మురళీ, అంబటి శేఖర్, విజయ, కృష్ణవేణి, పద్మమ్మ, జగదీశ్, పరమేశ్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శివార్చనతో ముక్తికి మార్గం



పడిపూజలో పాల్గొన్న శివస్వాములు

కొందుర్గు: శివార్చనతో ముక్తికి మార్గం కలుగుతుందని గురుస్వామి భూపాలచారి అన్నారు. సోమవారం జిల్లేడ్ చౌదరిగూడ మండలం లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ద్వాదశ జ్యోతిర్లింగ మహాపడిపూజ, జ్యోతిర్ముడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శివనామస్మరణతో గ్రామంలోని వీధులు మార్మోగాయి. కార్యక్రమంలో గురుస్వాములు యాదవరెడ్డి, నర్సింలు, సత్యనారాయణ, యాదయ్య, వెంకట్రామిరెడ్డి, వీరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత పంపిణీ



భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

కేశంపేట: మహాశివరాత్రి అంటే మోక్ష రాత్రి అని, జాగరణ చేయడంతో జాగృతికి జ్ఞానం కలుగుతుందని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞానవేదిక షాద్‌నగర్ కమిటీ అధ్యక్షురాలు సద్గుణ అన్నారు. శివరాత్రిని పురస్కరించుకొని మండల పరిధిలోని ఇప్పలపల్లి, ఫరూఖ్‌నగర్ మండలంలోని శేరిగూడ గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ఆమె సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రజలకు ఉచితంగా భగవద్గీత అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శివలింగం పైన ఉన్న మూడు విభూతి రేఖలు జీవాత్మ, ఆత్మ, పరమాత్మలకు గుర్తులన్నారు. ఆత్మను ఆరాధిస్తే జీవుడు మోక్షం పొందుతాడన్నారు. జీవుడు మోక్షం పొందేందుకు మధ్యలో విభూతి రేఖకు ఎర్రని బొట్టు పెట్టుకుంటాడని తెలిపారు. శివరాత్రి విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కోరారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు నవ్య, కుల్దీప్‌రెడ్డి, సుధీర్, ధన్వంతరి, దినేశ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని వినతి



ఎంఈఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కొందుర్గు: చౌదరిగూడ ఉన్నత పాఠశాలకు తెలుగు ఉపాధ్యాయుడిని నియమించాలని స్థానిక బీజేపీ నాయకులు సోమవారం ఎంఈఓ కిరణ్ కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాఠశాలలో 350 మంది విద్యార్థులు చదువుతున్నారని, ఈ పాఠశాలలో తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులు లేరన్నారు. ఈ పాఠశాలలో ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులు ఉండగా.. ఓ ఉపాధ్యాయురాలు డిప్యూటేషన్‌పై వెళ్లారని, మరో ఉపాధ్యాయురాలు మెటర్నటీ సెలవుపై వెళ్లారని వాపోయారు. దీంతో విద్యార్థులకు తెలుగు బోధించడానికి ఉపాధ్యాయులు లేరన్నారు. ఏ పాఠశాలలోనైనా తెలుగు ఉపాధ్యాయులు ఉన్నట్లయితే డిప్యూటేషన్‌పై చౌదరిగూడ ఉన్నత పాఠశాలకు పంపించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో బీజేపీ నాయకులు రామ్‌లక్ష్మణ్, అనిల్ ఉన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



శిక్షణలో పాల్గొన్న ఏపీఎం, మహిళలు తదితరులు

ఏపీఎం శోభారాణి

చేవెళ్ల: మహిళలు పౌష్టికాహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యం పొందాలని ఏపీఎం శోభారాణి సూచించారు. చేవెళ్లలో మహిళా సమాఖ్య కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల సభ్యులకు పౌష్టికాహారం(ఎఫ్‌ఎన్‌హెచ్‌డబ్ల్యూ)పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. మహిళలు ప్రతీ రోజు ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, పండ్లు, పాలు, గుడ్లు ఆహారంగా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు 1000 రోజుల ప్రణాళిక అమలుచేస్తూ వారికి పౌష్టికాహారం అందించే కార్యక్రమం చేపడుతుందని దీనిని మహిళలు అందరూ గుర్తించాలన్నారు. దీంతో పాటు మహిళలు పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. మహిళలు మీరు నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో మహిళలకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్యలోని గ్రామ సంఘాల సభ్యులు, సీసీఓ లక్ష్మి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పంటల నమోదు వేగవంతం



పంటల నమోదు చేస్తున్న ఏఈఓ

దౌల్తాబాద్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన డిజిటల్ పంటల నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా ఏఈఓలు ఆయా గ్రామాల్లో మొదటి విడతగా ఎలాంటి పొరపాట్లు లేకుండా పంటల నమోదు చేస్తున్నారు. అలాగే రైతులకు పంటల సాగుపై పలు సూచనలు సలహాలు అందిస్తున్నారు. సోమవారం సుల్తాన్‌పూర్, దౌల్తాబాద్‌లో ఏఈఓలు నిఖిల్, వైశాలి పంటల నమోదు చేశారు.

కరాటేలో ప్రతిభ చాటిన విద్యార్థులు

కుల్కచర్ల: విద్యార్థులు చదువుతోపాటుగా క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని చౌడాపూర్ ఎంఈఓ రాంచందర్ అన్నారు. ఆదివారం కొందుర్గు మండలంలో నిర్వహించిన కుంగ్‌ఫూ, కరాటే చాంపియన్స్ పోటీలలో భాగంగా మందిపల్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం పాఠశాలలో వారికి తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులు చదువు ఒక్కటే అనే విధానంతో కాకుండా అనేక అంశాల్లో రాణించాలన్నారు. కుంగ్‌ఫూ, కరాటే పోటీలలో సౌజన్య, యశస్విని మొదటిస్థానంలో నిలవగా తేజశ్రీ, నిహారిక, చరణ్‌లు ద్వితీయస్థానంలో నిలిచారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శకమిటీ చైర్‌పర్సన్ యాదమ్మ, ఉపాధ్యాయులు యాదయ్య, మురళీధర్, విజయశ్రావణ్ కుమార్, అనిల్, శ్రీను, జహీర్, సీఆర్పీ విజయకుమార్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

పశువైద్యాధికారి స్రవంతి



పశువులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్రవంతి

షాబాద్: ఉచిత పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి స్రవంతి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పాడి పశువులకు ఉచిత గర్భకోశ చికిత్సలు, చూడు పరీక్షలు, నట్టల నివారణ మందులు తాగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్యంపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. పాడి పశువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు తీసుకొని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు ఉన్నారు.

పండుగలకు చార్జీల పెంపు రద్దుచేయాలి

ఆర్టీసీ కమిషనర్‌కు వినతి

నందిగామ: ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా పలు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల నుంచి ఆర్టీసీ బస్సు చార్జీలను సుమారు 50 శాతం పెంచుతోందని, దీంతో భక్తులపై ఆర్థిక భారం పడుతుందని హిందూ జన జాగృతి సమితి చేగూరు శాఖ ప్రతినిధులు అన్నారు. సోమవారం చార్జీల పెంపును రద్దు చేయాలని కోరుతూ ఆర్టీసీ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు ఠాగూర్ రఘువీర్ సింగ్, నవీన్‌కుమార్‌యాదవ్, సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇతర మతాలకు సంబంధించిన వారు యాత్రలకు వెళ్లే సందర్భంలో రాయితీలు ఇస్తున్నారని, ఇందులో హజ్ యాత్ర, జెరుసేలం యాత్రకు వెళ్లే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తుచేశారు. ఇతర మతస్తులకు కేటాయించిన విధంగా హిందూ భక్తులకు కూడా ఉచిత బస్‌పాస్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు. హిందువుల పండగలకు మాత్రమే చార్జీలు పెంచడం సరికాదన్నారు. పండుగల సమయంలో ప్రయాణికులకు రాయితీలు కల్పించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు.



ఆర్టీసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న హిందూ జన జాగృతి సమితి సభ్యులు

మా గ్రామాలను మున్సిపాలిటీలో కలపొద్దు

కలెక్టర్, కమిషనర్లకు కందవాడ, పలుగుగుట్ట గ్రామస్తుల వినతి

చేవెళ్ల: చేవెళ్ల మున్సిపాలిటీలో మా గ్రామాలను కలపొద్దంటూ కలెక్టర్, కమిషనర్లకు కందవాడ, పలుగుట్ట గ్రామాల నాయకులు, ప్రజలు వినతి పత్రం అందించారు. సోమవారం ఆయా గ్రామాలకు చెందిన గ్రామ నాయకులు, గ్రామస్తులు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ నారాయణరెడ్డి, మున్సిపల్ కమిషనర్, పంచాయతీరాజ్ కమిషనర్లను కలిసి వినతపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పాటవుతున్న చేవెళ్ల మున్సిపాలిటీలో కందవాడ, పలుగుగుట్ట గ్రామాలను కలపొద్దని కోరారు. ఈ రెవెన్యూ పరిధిలో దాదాపు 5వేల ఎకరాల వ్యవసాయ భూములు ఉండగా ఇందులో 3వేల ఎకరాలలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు. అంతేగాకుండా ఈ రెవెన్యూ పరిధిలోని దాదాపు 500ల మంది వ్యవసాయ కూలీలు ఉపాధి జాబ్‌కార్డుల ద్వారా పనులు చేస్తున్నారని తెలిపారు. మున్సిపాలిటీలో విలీనంతో ఉపాధి మార్గాలు పోవటమే కాకుండా గ్రామీణ రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. మున్సిపాలిటీలో తమ గ్రామాలను కలపొద్దంటూ 3,100 మంది ప్రజల అభిప్రాయ సేకరణతో సంతకాలు చేయించి వినతి పత్రాలను ఉన్నతాధికారులకు అందించినట్లు చెప్పారు. ప్రజాభిప్రాయం మేరకు ప్రభుత్వం, అధికారులు నిర్ణయం తీసుకోవాలని కోరారు. వినతి పత్రాలు అందించిన వారిలో కందవాడ ఎంపీటీసీ మాజీ సభ్యుడు కావాలి రవీందర్, మాజీ సర్పంచ్ నర్సింలు, కందవాడ, పలుగుట్ట గ్రామ నాయకులు, ప్రజలు, దేవుపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కుర్వ మల్లేశ్, కుమార్, ఎం.బుచ్చిరెడ్డి, జంగారెడ్డి, పాండురంగారెడ్డి, మల్‌రెడ్డి, చాల్మారెడ్డి, మల్లికార్జున్, శ్రీశైలం, శివకుమార్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అరుణ్‌కుమార్, సత్త య్యగౌడ్, కుమార్, వెంకటేశ్ ఉన్నారు.



జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామ నాయకులు, ప్రజలు